

మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డిని ప్రకటిస్తున్న సీఎం రేవంత్



స్టాల్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సీఎం; చిత్రంలో మంత్రులు

కొడంగల్ రూపురేఖలు మార్చాలి

కోస్గి రూరల్: కొడంగల్ నియోజకవర్గం రూపురేఖలను మార్చాలని, అందుకు అధికారులు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కోస్గిలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కొడంగల్ - నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు బీటీ రోడ్లు, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, వెటర్నరీ కళాశాల, తదితర పనులకు సంబంధించిన 12 శిలాఫలకాలను మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాలకు రూ.107.53 కోట్ల నిధులు మంజూరు చేసి, చెక్కును అందించారు. దుద్యాల మండలం పోలేపల్లి గ్రామానికి అడిగిన వెంటనే మహిళాసంఘం భవనాన్ని మంజూరు చేశారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌గారి అమ్మమ్మ గారి ఊరు పోలేపల్లి అని ముఖ్యమంత్రి తెలిపారు. సంఘాలను బలోపేతం చేసుకోవాలని మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. మహిళా సంఘాల వ్యవస్థ మొదటగా పాలమూరులోనే ప్రారంభమైందని, 1995లో దౌల్తాబాద్‌లో గులాబీ మహిళాసంఘం ఏర్పడిందని తెలిపారు. హైదరాబాద్‌కు అమెరికా అధ్యక్షుడు జార్జ్‌బుష్ వచ్చినప్పుడు, ఆయనకు మహిళా సంఘాల గురించి వివరించింది గులాబీ సంఘం వారేనని గుర్తు చేశారు. అందుకు ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

గుండెల్లో పెట్టుకొని..
చూసుకుంటా

- కొడంగల్ ప్రజలు భుజాలపై మోసి సీఎంను చేసి.. గుర్తింపు తెచ్చారు
- పాలమూరు ప్రజలను మోసం చేసినందుకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి
- ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ పాలనలోనే పాలమూరుకు అన్యాయం
- పీఆర్ఎల్ఐ జాతీయ హోదాకు మోదీ ఇచ్చిన హామీపై సమాధానం చెప్పాలి
- చల్లా వంశీచంద్‌రెడ్డిని 50 వేల మెజారిటీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి
- కోస్గి కాంగ్రెస్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



కోస్గి సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నల్లమల ప్రాంతంలోని కుగ్రామం నుంచి వచ్చిన నన్ను ఆశీర్వదించి.. కొడంగల్ ప్రజలు తమ భుజాలపై మోసి.. సీఎంను చేయడంతోపాటు ఢిల్లీ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. ఈ నియోజకవర్గ ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. పాలమూరు గడ్డ అక్కున చేర్చుకుని ఆశీర్వదిస్తే ఈ స్థాయిలో ఉన్నాన'ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించి రూ.4,369 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం కోస్గి పట్టణంలో శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సమాఖ్య సమీపంలోని మైదానంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌లో నోరు లేకున్నా.. పాలమూరులో ఊరు లేకున్నా.. కరీంనగర్‌లో ఓటమి భయంతో పారిపోయి పాలమూరుకు వస్తే.. కేసీఆర్‌ను ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదించారని, కానీ పదేళ్ల తన పాలనలో పాలమూరుకు ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ అన్యాయం చేశారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ద్వారా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేదని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సాధించుకున్న నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టారని విమర్శించారు. పాలమూరుకు అత్యంత నష్టం చేసే విధంగా ఏపీ సీఎం జగన్ రోజుకు 12 టీఎంసీలు తరలించుకునే విధంగా పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు, రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులకు అవకాశం కల్పించారని, ప్రగతి భవన్‌కు పిలిచి భోజనాలు పెట్టి పంపించారని అన్నారు. రోజా ఇంట్లో పులుసు తిని బలిసిపోయి.. 203 జీవో ద్వారా కృష్ణా నీళ్లను ఏపీకి అప్పగించారని ఆరోపించారు. అభివృద్ధి ముసుగులో పాలమూరును దోచుకుని.. ఓట్ల కోసం మళ్లీ ప్రజా పోరుబాట పేరుతో పాదయాత్ర చేయడానికి వస్తున్నారన్నారు. అంతకంటే ముందు కేసీఆర్ పాలమూరు ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రజలు చీత్కరించిన తర్వాత కూడా ఏ మొఖం పెట్టుకుని యాత్రలు చేస్తారని విమర్శించారు. పాలమూరుకు జాతీయ హోదా ఇస్తానని 2014లో మోదీ హామీ ఇచ్చారని, నేటికీ హోదా ఇవ్వకపోడానికి ఈ ప్రాంత నాయకులైన డీకే అరుణ, జితేందర్‌రెడ్డి సమాధానం చెప్పాలని అన్నారు. కిషన్‌రెడ్డి అయిదేళ్లుగా కేంద్రమంత్రిగా ఉండి.. వికారాబాద్- కృష్ణా రైల్వేలైన్‌కు తట్టెడు మట్టి తీయించలేదని ఎద్దేవా చేశారు. సిమెంట్ పరిశ్రమలు, రైల్వేలైన్, కృష్ణానది జలాలు రావాలంటే మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి ఎంపీగా చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కొడంగల్‌లో 50 వేల మెజారిటీ ఇచ్చిన తర్వాత ఇప్పుడు ఇచ్చిన నిధులతో పాటు మరో రూ. ఐదు వేల కోట్లు నిధులతో మరింత అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డిని పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించారు.



సభకు హాజరైన జనం

ఈ ప్రాంతాన్ని పట్టించుకోలే: కోమటిరెడ్డి

కొడంగల్ ప్రాంతం సీఎం రేవంత్‌రెడ్డి వల్ల అందరికీ సుపరిచితమైందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాంతం కరువు, వలసలతో అల్లాడితే పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కారణంగా పట్టించుకోలేదన్నారు. కేవలం గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలను మాత్రమే అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు. కమీషన్ల కక్కుర్తి వల్ల పాలమూరు, నల్గొండ జిల్లాలకు అన్యాయం చేసిన కేసీఆర్ రేవంత్‌రెడ్డి ఎడమకాలి గోటికి సరిపోరని విమర్శించారు. ప్రాజెక్టుల పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.



వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు

నారాయణపేటకు జీవధార: ఉత్తమ్

తన అనుభవంలో ఒకేరోజు నియోజకవర్గానికి రూ.4,369 కోట్లతో నిధులతో పనులను ప్రారంభించుకోవడం ఇదే మొదటిసారని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో కొడంగల్ నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. కొడంగల్‌ను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో ఎత్తిపోతల పథకం నిర్మించాలని తలపెట్టినా పట్టించుకోలేదని అన్నారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం తీవ్ర దుర్భిక్షమైన ఈ జిల్లాకు జీవధారగా నిలుస్తుందని అన్నారు. భూత్పూరు రిజర్వాయర్ నుంచి నాలుగు దశల్లో 7.10 టీఎంసీల మిగులు జలాలతో రూ. 2945.50 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. ముందు ప్రతిపాదించిన లక్ష ఎకరాల ఆయకట్టుకు అదనంగా మరో 30వేల ఎకరాలు చేర్చి.. 1.30లక్షల ఎకరాల ఆయకట్టును నిర్దేశించామని అన్నారు. మొత్తం నాలుగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మిస్తామని అన్నారు. భూత్పూరు నుంచి ఉట్కూరు రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి జాజాపూర్‌కు, అక్కడి నుంచి జయమ్మ చెరువుకు, అక్కడి నుంచి కానుకుర్తి రిజర్వాయర్‌కు నీరును లిఫ్ట్ చేస్తామని అన్నారు. ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

పాలమూరును కృష్ణా డెల్టా చేస్తాం: జూపల్లి కృష్ణారావు

అంచెలంచెలుగా ఎదిగి.. రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు సాగునీటి ప్రాజెక్టులతో పాటు.. విద్యా, వైద్య, రోడ్ల సదుపాయాలను కల్పించేందుకు భారీ నిధులతో శంకుస్థాపనలు చేయడం గర్వంగా ఉందని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరును మరో కృష్ణా డెల్టాలాగా మారుస్తామని అన్నారు.

మరో జలయజ్ఞం: వంశీచంద్‌రెడ్డి

పాలమూరులో ప్రస్తుతం నీరందిస్తున్న ప్రాజెక్టులన్నీ.. కాంగ్రెస్ జలయజ్ఞంలో చేపట్టినవేనని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపనతో రాష్ట్రంలో మరో జలయజ్ఞం ప్రారంభమైందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డి బలాన్ని ఇంకా పెంచాలని కోరారు. ఈ సభలో ఎమ్మెల్సీలు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి జడ్పీ చైర్మన్లు సునీత, సరిత తిరుపతయ్య, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, తూడి మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, రాజేష్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, మందుల సామెల్, మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, చెంచు సంఘం నాయకులతో సమావేశమైన పీవో

ఐటీడీఏలో గ్రీవెన్స్‌డే

- అధికారులతో ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి సమీక్ష సమావేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మన్ననూర్, ఫిబ్రవరి 21: చెంచుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఇక నుంచి ప్రతీ బుధవారం మన్ననూర్ ఐటీడీఏ కార్యాలయంలో ప్రజా దర్బార్(గ్రీవెన్స్ డే) నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి తెలిపారు. 'మన్ననూరు ఐటీడీఏకు మహర్దశ లభించేనా' అనే శీర్షికన ఈ నెల 20న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పీవో స్పందించారు. ఈ మేరకు బుధవారం మన్ననూరులోని ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు, ఆదివాసీ, చెంచు నాయకులతో వేర్వేరుగా సమీక్షా సమావేశాలను నిర్వహించారు. చెంచు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జన్‌మన్ పథకం పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. చెంచు పెంటల్లో ఆధార్‌కార్డులు అందరికీ అందేలా చూడాలని చెప్పారు. వేసవిలో తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల వీటీడీఏలతో చర్చించి, అభివృద్ధి కోసం ముందుకు సాగుతామన్నారు. ఆదివాసీల అతిపెద్ద జాతర అయిన సమ్మక్క సారలమ్మ జాతరకు నల్లమల ఆదివాసీల తరఫున మన్ననూరు ఐటీడీఏ నుంచి పసుపు, కుంకుమ, చీర, సారెలను చెంచు పెద్దలు, ఆడపడుచుల ద్వారా పంపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నల్లమలలోని భౌరాపూర్‌లో మహాశివరాత్రి రోజు జరిగే చెంచుల జాతర, సలేశ్వరంలో జరిగే లింగమయ్య ఉత్సవాలను ఐటీడీఏ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో డీటీడీవో కమలాకర్ రెడ్డి, ఐటీడీఏ ఏవో జాఫర్ హుసేన్, డిప్యూటీ ఈవో శంకర్ నాయక్, ఐకేపీ ఏపీడీ లక్ష్మయ్య, మన్ననూరు ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, చెంచు సంఘాల నాయకులు రాజేంద్ర ప్రసాద్, చిర్ర రాములు, పెద్దిరాజు, గురువయ్య, లింగయ్య పాల్గొన్నారు.

బీజేపీతోనే అవినీతిరహిత పాలన

- కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి - కొత్తకోటలో సాగిన విజయ సంకల్ప యాత్ర

కొత్తకోట, ఫిబ్రవరి 21 : బీజేపీతోనే అవినీతి రహిత పాలన సాధ్యమని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం విజయ సంకల్ప యాత్ర కొత్తకోటకు చేరుకుంది. ఈ సందర్భంగా చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో అవినీతి రహిత పాలన సాగించిన ఘనత మోదీకే దక్కిందన్నారు. భారత దేశాన్ని ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలబెట్టి అభివృద్ధి పథంలో నడిపించడం మోదీకే సాధ్యమన్నారు. రైతుల సంక్షేమం కోసం ఎకరానికి రూ. 18వేల సబ్సిడీతో పాటు ప్రతీ వ్యక్తికి నెలకు ఐదు కిలోల బియ్యం ఇస్తున్నరని గుర్తు చేశారు. పేద కుటుంబ నుంచి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. ప్రధాని అవాజ్ యోజన పథకం కింద రాష్ట్రానికి ఇండ్లు మంజూరు చేస్తే కేసీఆర్ శనిశ్వరుడిగా మారి ప్రజల నెత్తిన శఠగోపం పెట్టాడని ఆరోపించారు. అవినీతికి కేరాఫ్‌గా ఉండి రాముడిని వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో దూరం పెట్టాలన్నారు. సమర్థవంతమైన పాలన అందిస్తున్న బీజేపీ మరోసారి అధికారంలోకి రావడం కోసం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఆదరించాలని కోరారు. సభకు పవన్ కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నారాయణ, ప్రశాంత్‌రెడ్డి, నర్సింహులు, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



యాత్రలో మాట్లాడుతున్న కిషన్ రెడ్డి

ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు పూర్తి చేయాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా,ఫిబ్రవరి21: ఎన్నికల విధులలో పాల్గొనే అన్ని విభాగాలకు సంబంధించిన సిబ్బందికి శిక్షణా తరగతులు పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల విధులలో పాల్గొనే అన్ని విభాగాలకు సంబంధించిన సిబ్బందికి శిక్షణా తరగతులు పూర్తి చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిది ఓటరు జాబితాలో పేరు నమోదు కావాలని సూచించారు. ఓటర్ జాబితాకు సంబంధించి పుట్టిన తేదీ కరెక్షన్స్, డూప్లికేట్ ఎపిక్ నంబర్స్ వంటి వాటిపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధరణి పెండింగ్ అప్లికేషన్లు, భూముల రిజిస్ట్రేషన్ సమస్యల గురించి అధికారులతో చర్చించారు. సమావేశంలో ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ఇంటి పైకప్పు తొలగించి మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో..
వస్త్ర దుకాణం దగ్ధం

- వస్త్రాలు, ఇంటి నిర్మాణం కలిపి రూ.80 లక్షల ఆస్తినష్టం

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 21: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని చిన్నఅగ్రహారం కాలనీలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న వస్త్ర దుకాణంలో బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.80 లక్షల ఆస్తినష్టం సంభవించింది. బాధితులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న అగ్రహారం కాలనీలో ప్రవీణ్ ఇంట్లో చంద్రబాబు అనే వ్యక్తి కొంత కాలంగా వస్త్ర దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో దుకాణంలో మంటలు వచ్చాయి. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చారు. ఇంటి గదులు చిన్నవిగా ఉండటం, వాట్లతో కూడిన పైకప్పు ఉండటంతో ఫైర్ సిబ్బందికి లోపలికి వెళ్లేందుకు వీలు కాలేదు. పైకప్పు కూలిపోయే స్థితికి రావడంతో పైకప్పు తొలగించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే వస్త్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇల్లు కూడా పూర్తిగా దెబ్బతింది. వస్త్ర దుకాణం, ఇంటి నిర్మాణం మొత్తం కలిసి రూ.80 లక్షల దాకా ఆస్తినష్టం సంభవించినట్లు ప్రవీణ్, ఫైర్ సిబ్బంది గౌస్‌పాష చెప్పారు. తమకు సమాచారం వచ్చిన వెంటనే అక్కడికి వెళ్లడం వల్ల పక్కన ఉన్న ఇళ్లకు ఎలాంటి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకున్నామని గౌస్‌పాష చెప్పారు. ఫైర్ సిబ్బంది రాందాస్, లక్ష్మన్ననాయుడు, గౌస్ పాష, ఖాజాపాషా మంటలను ఆర్పారు.

సంఘటనా స్థలం పరిశీలన

వస్త్ర దుకాణం దగ్ధమైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సరిత వెళ్లి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి బాధితుడికి నష్టపరిహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

అనుమానాస్పదంగా కన్పించిన మహిళ

- ఆమె దగ్గరున్న సంచిలో రెండు కత్తులు, గ్లౌజ్‌లు



బ్యాగ్‌లో లభించి కత్తులు

గద్వాల, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని నదీ అగ్రహారంలో బుధవారం రాత్రి ఓ మహిళ అనుమానాస్పదంగా తిరుగుతుండటం గమనించి గ్రామస్థులు అనుమానించారు. ఆమెను ప్రశ్నించగా సమాధానం ఇవ్వక పోగా పరుగులు తీసింది. దీంతో కొందరు యువకులు వెంబడించి ఊరిబయట ఆమెను పట్టుకొని ప్రశ్నించగా, తనది బిహార్ రాష్ట్రం అని హిందీలో చెప్పింది. ఎందుకు వచ్చావని అడగ్గా ఆమె సమాధానం చెప్పలేదు. ఆమె వద్దనున్న సంచిని తనిఖీ చేయగా, రెండు కత్తులు, గ్లౌజ్‌లు ఉండటంతో ఆమె చేతులను కట్టేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి ఆమెను స్టేషన్‌కు తరలించారు. ఆమె వెంట ఉన్న మరొకరు తప్పించుకు పోయాడని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాస్‌ను అడుగగా, ఆమెకు మతిస్థిమితం లేదని తెలిపారు. ఆత్మరక్షణ కోసం కత్తులు ఉంచుకున్నట్లు చెప్తోందన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

- తప్పిన ప్రాణాపాయం



కాల్వలోకి దూసుకెళ్లిన కారు

పాన్‌గల్, ఫిబ్రవరి 21: బైక్‌ను తప్పించబోయి కాల్వలోకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని అన్నారం తండా సమీపంలో బుధవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి స్థానికుల వివరాల ప్రకారం.. వనపర్తికి చెందిన ముగ్గురు వ్యక్తులు కొల్లాపూర్‌లో వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా అన్నారం తండా సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయ్యారు. దాంతో కారు రోడ్డు పక్కన ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. అయితే ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రాణాపాయం తప్పింది.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు
ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
కల్వకుర్తి : 9985403252
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

స్వామివారికి హంస వాహన సేవ


హంస వాహన సేవలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 21 : తెలంగాణ తిరుపతి మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హంస వాహన సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆళహరి మధుసూదన్‌కుమార్, అర్చకులు స్వామివారిని పల్లకిలో ఊరేగించి, గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి శ్రీనువాసరాజు, అడిషనల్ కార్యనిర్వహణ అధికారి శ్రీనువాస్, ఆలయ వంశపార ధర్మకర్త రామకృష్ణ, సూపరింటెండెంట్ నిత్యానందం, ఫెస్టివల్ ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల


డిగ్రీ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, అధికారులు


పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21 : యూనివర్సిటీలో యూజీ, పీజీ ఫలితాలు ఇంకా మెరుగుపడాలని పీయూ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ సూచించారు. బుధవారం పీయూలోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణ అధికారి డా.రాజ్‌కుమార్, యూజీ, పీజీ కళాశాలల డైరెక్టర్‌తో కలిసి పాలమూరు యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫలితాలు విడుదల చేశారు. డిగ్రీ మొదటి సెమిస్టర్, మూడో సెమిస్టర్, ఐదో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే ఫలితాలు కొంత పెరిగినా ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, మొదటి సెమిస్టర్‌కు 21,743 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 6,974 మంది ఉత్తీర్ణత సాధించారు. 7,709 మంది పైతరగతులకు ప్రమోట్ అయ్యారు. మూడో సెమిస్టర్‌లో 17,401 మంది హాజరుకాగా, 7,749 మంది ఉత్తీర్ణత సాధించారు. 5,206 మంది విద్యార్థులు పైతరగతులకు ప్రమోట్ అయ్యారు. ఐదో సెమిస్టర్‌లో 13,211 మంది పరీక్ష రాయగా, 6,758 మంది ఉత్తీర్ణత సాధించారు. 4,986 మంది విద్యార్థులు పైతగరతులకు ప్రమోట్ అయ్యారు. పరీక్ష ఫలితాలను పాలమూరు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, విద్యార్థులు చూసుకోవచ్చని తెలిపారు. మార్కులు తక్కువగా వచ్చినట్లు భావించే విద్యార్థులు, ఫెయిల్ అయిన విద్యార్థులు రీవాల్యుయేషన్ కోసం ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కిషన్‌రెడ్డికి స్వాగతం పలికిన పీయూ విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21 : విజయ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం పాలమూరు యూనివర్సిటీకి వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పీయూ ఏబీవీపీ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పరిపాలనా భవనం వద్ద పీయూ వీసీ అధికారులతో కలిసి కిషన్‌రెడ్డి రాక కోసం వేచి ఉండగా యూనివర్సిటీ విద్యార్థులు, ఏబీవీపీ విద్యార్థులు పరిపాలన భవనం వైపు మళ్లే సర్కిల్ వద్దనే కిషన్‌రెడ్డికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అభివృద్ధి, సమస్యలు, విద్యార్థుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నుంచి వినతి పత్రం తీసుకొని పరిపాలన భవనం వద్దకు రాకుండా అక్కడ్నుంచే తిరిగి వెళ్లిపోయారు. గమనించిన వీసీ వెంటనే సర్కిల్ వద్దకు వెళ్లి కిషన్‌రెడ్డి తదుపరి కార్యక్రమం జరిగే ప్రదేశంలో పూలబొకె ఇచ్చి స్వాగతం పలికారు. విద్యార్థులు ముందే ఆపి స్వాగతం పలకడం ద్వారా కోఆర్డినేషన్ సమస్య వల్ల తప్పిదం జరిగిందని కిషన్‌రెడ్డికి వివరించారు. అనంతరం పీయూకి రూ.వంద కోట్లు మంజూరు చేసినందుకు, మంజూరు కావడానికి కృషి చేసిన కిషన్‌రెడ్డికి, డీకే అరుణకు కృతజ్ఞతలు తెలిపారు. మరోమారు పీయూకి వస్తామని వీసీకి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు.




















A VI ANAND FANTASY
From the Director of
SUPER HIT నేడే చూడండి



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00, 2.15, 6.00, 9.15



GLOBAL CINEMAS LLP

విజయవంతమైన 2వ వారం
BLASTING BLOCKBUSTER



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

GLOBAL CINEMAS LLP



- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం

మేడారం.. జన సంద్రం..

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాట పట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటుచూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనమైంది.



సమ్మక్క గద్దె



వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవింద రాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.



కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య



జంపన్నవాగు వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం



జాతరలో జాతకాలు చెబుతున్న కోయదొర

డిగ్రీ కళాశాలను
సందర్శించిన న్యాక్ బృందం



జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న న్యాక్ బృందం

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : జడ్చర్ల బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం న్యాక్ బృందం పరిశీలించింది. న్యాక్ బృందం ఛైర్మన్‌గా కర్ణాటక రాష్ట్రం హసన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ టీసీ.తారానాథ్, కోఆర్డినేటర్ సభ్యుడిగా తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.జయచంద్రారెడ్డి, సభ్యుడిగా అస్సాం రాష్ట్రం జోర్హాట్ జేబీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బిమల్‌బరాహ్‌లు కళాశాలను సందర్శించారు. గత సంవత్సరం మార్చి 15, 16వ తేదీల్లో న్యాక్ బృందం పర్యటించింది. కాగా, కళాశాలలో చేపట్టిన అభివృద్ధికి గుర్తింపుగా కేవలం బి++ గ్రేడ్ రావడంతో, సరైన గ్రేడ్ రాలేదని, పునఃపరిశీలిచేందుకు మళ్లీ పర్యటించాలన్న కళాశాల యాజమాన్యం విజ్ఞప్తి మేరకు తాజాగా న్యాక్ బృందం రెండురోజుల పాటు కళాశాలలో పర్యటించనుంది. కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, సదుపాయాలు, వసతులు, తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి, కళాశాలకు కేటాయించాల్సిన గ్రేడ్ అంశంపై సిఫారసు చేయనున్నారు. న్యాక్ బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ అప్పియచిన్నమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులకు బోధిస్తున్న తీరుపై మొదటగా అధ్యాపకులతో సమావేశమయ్యారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడారు. కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రస్తుతం అందిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలతో పాటు అదనంగా కావాల్సిన వాటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను సందర్శించి, హెర్బేరియంను పరిశీలించారు. అనంతరం కళాశాలలోని వివిధ విభాగాధిపతులతో మాట్లాడి, ఆయా విభాగాల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, విద్యాబోధనను పరిశీలించారు. అనంతరం అలూమ్ని సమావేశ గదిలో పూర్వ విద్యార్థులతో సమావేశం అయ్యారు. కళాశాలకు కావల్సిన సదుపాయాల కోసం అలూమ్ని ద్వారా ఇప్పటికే రూ.66లక్షలకు పైగా వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని అలూమ్ని అధ్యక్ష, కార్యదర్శులు పాలాదిరాంమోహన్, బాదిమి రవిశంకర్‌లు వివరించారు. రెండురోజుల పర్యటనలో భాగంగా గురువారం సైతం బృందం కళాశాలలో పర్యటించనుంది. కళాశాలకు కేటాయించే గ్రేడ్‌కు సంబందించిన పూర్తి నివేదికను యుజిసికి అందించనున్నట్లు న్యాక్ బృందం తెలిపింది. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్, అలూమ్ని కళాశాల కోఆర్డినేటర్ శ్రీనివాసులు, బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై వేంకటేశ్వర స్వామి ఊరేగింపు


అంజనగిరి క్షేత్రంలో సింహ వాహనంపై స్వామివారి ఊరేగింపు

ఖిల్లా ఘణపురం, ఫిబ్రవరి21: మండలంలోని గట్టుకాడిపల్లి అంజనగిరి క్షేత్రంలో వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారిని సింహ వాహనంపై ఊరేగించారు. ఆలయం ఆవరణంలో అంగరంగ వైభవంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేద పండితులు మంత్రోచ్చారణ మధ్య నిర్వహించారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవా నికి ఏర్పాట్లు సిద్ధం చేశారు. రాత్రివేళ స్వామి వారి అమ్మవారి ఎదుర్కోల్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి వారి సింహ వాహన ఊరేగింపును తిలకించారు. అనంతరం పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈనెల 22న తిరు కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు హాజరై స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని ఆలయ పూజారి కన్నయ్య తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొత్తకోట, ఫిబ్రవరి 21 : బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని దండుగడ్డ కాలనీలో సిలిండర్‌పేలి గుడిసె దగ్ధమై నిరాశ్రయులైన గట్టు యాదవ్ కుటుంబాన్ని బుధవారం తహసీల్దార్ బాల్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పరామర్శించారు. తక్షణ సహాయంగా రూ. 50 వేలు అందజేశారు. నాయకులు ప్రశాంత్, గొల్లబాబు, డాక్టర్ పీజే. బాబు, అమర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మేస్త్రీశ్రీను, బీచుపల్లి యాదవ్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, గోకరయ్య, సలీంఖాన్, లతీఫ్, సుల్తాన్, ముజీబ్, సురేందర్‌రెడ్డి, వెంకటరమణ, సాయిలు యాదవ్, రాంలాల్ నాయక్, అంజన్న యాదవ్, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాములు యాదవ్, యాదగిరి, నరేందర్ సాగర్ తదితరులున్నారు.

'పెండింగ్‌లో ఉన్న ఆర్పీల వేతనాలు చెల్లించాలి'

కొత్తకోట, ఫిబ్రవరి 21 : పెండింగ్‌లో ఉన్న ఆర్పీల వేతనాలు వెంటనే చెల్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ కోరారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో ఆర్పీ (మెట్మా రిసోర్సెస్) వర్కర్స్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ మహిళలకు అభయ హస్తం డబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్పీలకు కనీస వేతనం చట్టం ప్రకారంగా నెలకు రూ. 26 వేతనం ఇస్తూ, బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, ఆర్పీలు లావణ్య, సౌజన్య, పద్మ, అంజుమ్‌బేగం, యాస్మిన్ బేగం, సుజాత, స్వప్న తదితరులున్నారు.

'లెనిన్ జీవిత చరిత్ర అధ్యయనం చేయాలి'

వీపనగండ్ల, ఫిబ్రవరి 21: ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గ విప్లవం జయప్రదం కావాలంటే లెనిన్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి డి.బాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రెడ్ బుక్ డే సందర్భంగా లెనిన్ జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, వెంకటేశ్వర్లుగౌడ్, భక్తుల రాముడు, నాగేష్, ప్రవీణ్‌గౌడ్, రామన్‌గౌడ్, తిరుపతయ్య, రామకృష్ణ, శ్రీనివాస్, నవీన్ ఉన్నారు.

ఆడపిల్లలపై వివక్ష చూపరాదు

- చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ అశోక్‌కుమార్

పెద్దమందడి, ఫిబ్రవరి 21: ఆడపిల్లలపై వివక్ష చూపరాదని మగపిల్లలతో సమానంగా పెంచి చదివించాలని చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం పెద్దమందడి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ వారు వివిధ అంశా లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఆపద సమయంలో 1098, 112, 100, 181 టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు. సమావేశంలో గోపీనాథ్, హెడ్‌కానిస్టేబుల్ రాజేందర్‌రెడ్డి, చైల్డ్‌హెల్ప్‌లైన్ కేసువర్కర్ రవిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని ఈదమ్మ గుడి వెనుక భాగంలో ఉన్న 'విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదరకంగా మారింది' అనే శీర్షికన ఈనెల 19న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఈదమ్మ జాతర నేపథ్యంలో ఆలయం వెనుక భాగం ఆవరణంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో భక్తులకు ఇబ్బంది కలగకుండా పకడ్బందీగా కంచెను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ కొండయ్య తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' కథనంతో సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



నృత్యం చేస్తున్న రేడియంట్ హైస్కూల్ ఒకటో తరగతి బాలబాలికలు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21: ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటపాటల్లో కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో బుధవారం సాయంత్రం రేడియంట్ హైస్కూల్ డైరెక్టర్ డి రాములు యాదవ్ ఆధ్వర్యంలో పాఠశాల 18వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, వ్యాఖ్యాత బైరోజు చంద్రశేఖర్, తెలుగు భాషా పండితుడు నారాయణరెడ్డి, కౌన్సిలర్ నాగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించని మండల అధికారులు

చిన్నంబావి,ఫిబ్రవరి21: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ అధికారులు సమయ పాలన పాటించ ట్లేదని వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల వరకు కార్యాలయానికి చేరుకోవాల్సిన అధికారులు ఉదయం 11:30 అయితే గానీ రావట్లేదని వాపోయారు. అధికారులు సమయానికి కార్యాలయానికి రాకపోవడంతో రెండు మూడు సార్లు కార్యాలయం చుట్టు తిరిగిపోవాల్సి వస్తుందని అంటున్నారు. మంగళవారం కూడా ఉదయం 11:30 గంటల వరకు ఏ ఒక్క అధికారి కూడా కార్యాలయానికి చేరుకోలేదని స్థానికులు తెలిపారు. ఆ సమయం వరకు కార్యాల యంలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. అధికారులు సకాలంలో హాజరైతే పనులు జరుగుతాయన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వాల లక్ష్యం: డీపీఎం

ఆత్మకూరు,ఫిబ్రవరి21: మహిళల ఆర్థికాభివృద్ధే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని డీఆర్‌డీఏ శిక్షకులు డీపీఎం అరుణ మద నాపూర్ ఏపీఎం కృష్ణవేణి అన్నారు. ఆత్మకూరు మండల మహి ళా సమాఖ్య భవనంలో ఆత్మకూరు, అమర చింత మండలాల వీవోఏలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీఎం అరుణ మాట్లాడుతూ.. నిరుపేద మహిళా సంఘం సభ్యుల ను గుర్తించి జీవనోపాధి కోసం ఐదు లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసిందని తెలిపారు. కార్యక్రమం లో ఆత్మకూరు, అమరచింత ఏపీఎంలు శ్రీనివాసులు, వెంకటేష్, సీసీలు ఆంజనేయులు, తిరుపతమ్మ, అన్వర్, బీసన్న లతో పాటు రెండు మండలాల రవి, పల్లవి రంగన్న గాయత్రి , గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది

● వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



దివ్యాంగురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి పౌరుడికి వజ్రాయుధం లాంటిదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీకృత భవనంలో ఏర్పాటు చేసిన ఓటు హక్కు ఈవీఎం అవగాహన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన భారత రాజ్యాంగం ప్రతి 18 సంవత్సరాలు పైబడిన వ్యక్తికి ఓటు హక్కును కల్పించిందన్నారు. కొత్తగా ఓటు హక్కు కలిగిన పౌరులు ఈవీఎంలో తమ ఓటును ఎలా వినియోగించుకోవాలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో అవగాహన పొందవచ్చని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌కు వచ్చిన ఒక దివ్యాంగురాలి విన్నపాన్ని తెలుసుకున్న ఆయన వెంటనే దివ్యాం గురాలికి స్కూటీ అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో పారిశుధ్య సిబ్బంది ఎమ్మెల్యేకు పూల మొక్క అందించి తమ సమస్యలను వివరించారు. కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చిన ప్రభుత్వంతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి, లక్కాకుల సతీష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉమ్మల రాములు, సత్యశీలారెడ్డి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ జగదీష్
- కలెక్టరేట్ ముందు ధర్నా


కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 21: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ జగదీష్ డిమాండ్ చేశారు. బుధవారం ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, గత ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక పోకడలతో ముందుకు సాగిందని అన్నారు. ఈ ప్రభుత్వమైన సోయి తెచ్చుకొని విద్యార్థుల పక్షాన ఉంటుందంటే విద్యార్థి వ్యతిరేక విధానాలతో ముందుకు వెళ్తుందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చి మూడు నెలలు గడుస్తున్నా ఇం త వరకు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ , స్కాలర్‌షిప్ విడుదల చేయక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆరు గ్యారెంటీలు కావు, స్కాలర్‌షిప్ , ఫీజు రీయింబర్స్‌మెంట్ అవసరం అన్నారు. డిగ్రీ పూర్తయిన విద్యార్థులు వాళ్ల ఉన్నత చదువులకు పోవాలంటే సర్టిఫికెట్ అవసరం ఉంటుంది కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రాక సర్టిఫికెట్స్ కళాశాల యజమాన్యం ఇవ్వకపోవడం వల్ల విద్యకు దూరమైపోతున్నారు. పేద మధ్య తరగతి చదివే ప్రభుత్వ కళాశాలలో ఇదే పరిస్థితిని ఈ ప్రభుత్వం సోయి తెచ్చుకొని ఇకనైనా స్కాలర్‌షిప్ రిలీజ్ చేయకపోతే పెద్ద ఎత్తున మంత్రుల, ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసు, ప్రగతి భవన్‌ను ఎక్కడికక్కడ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ, జిల్లా ఖేల్ కన్వీనర్ కేదారనాథ్, ప్రత్యూష, రమ్య, సంగీత, కార్తీక్, నవీన్, నితీన్, అరవింద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ది బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ ఎగ్జిబిషన్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో గోవిందరాజులు

వనపర్తి రూరల్, ఫిబ్రవరి21: వనపర్తి పట్టణ కేంద్రంలోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ది బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ ఎగ్జిబిషన్ (వ్యర్థాల నుండి ఉత్తమమైన ప్రదర్శన) బుధవారం నిర్వహించారు. ఏదైనా ఉపయోగించని పదార్థం / వస్తువును ఆకర్షణీయమైన కళా రూపంగా మార్చే విధంగా ప్రదర్శనలో చూపించారు. తెలంగాణ స్టేట్ నేషనల్ గ్రీన్ కార్ప్స్, డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పాఠశాల విద్యాశాఖ సహకారంతో నిర్వహించబడుతున్న జిల్లాస్థాయి ప్రదర్శనలో జిల్లాలోని ఎంపిక చేయబడ్డ ఉన్నత, ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల కేజీబీవీ యాజమాన్యాల విద్యార్థులు , గైడ్ టీచర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ చంద్రశేఖర్, ఎన్జీసీ స్టేట్ ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, నేషనల్ గ్రీన్ క్రాప్ జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్‌రావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎగ్జిబిషన్ తిలకించడానికి జిల్లా విద్యాధికారి గోవిందరాజులు విచ్చేసి విద్యార్థులు రూపకల్పన చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం డీఈవో విజేతలైన క్యాష్ అవార్డు మెమోంటో , సర్టిఫికెట్లతో బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమ సమన్వయకర్తగా జిల్లా ఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్, వ్యవహరించారు.

చార్మినార్ ఏసీపీగా అమరచింత వాసి


ఏసీపీ సుదర్శన్

అమరచింత,ఫిబ్రవరి21: చార్మినార్ నూతన ఏసీపీగా అమరచింతకు చెందిన సుదర్శన్ నియమితులయ్యారు. అమరచింతలో జన్మించి ఇక్కడే చదువుకున్న సుదర్శన్ హైదరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా, సీఐగా డీఎస్పీగా విధులు నిర్వహించారు. తాజాగా చార్మినార్ నూతన ఏసీపీగా పదోన్నతిపై బాధ్యతలు స్వీకరించారు. అమరచింత వాసి అయిన సుదర్శన్ పదోన్నతి పొందడం పట్ల తోటి స్నేహితులు, గ్రామస్థులు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు అయూబ్‌ఖాన్, నాగభూషణం గౌడ్, రామ్మోహన్ శెట్టి , మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మనోహర్ రాజు శెట్టి, గోపి హర్షం వ్యక్తం చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీపనగండ్ల, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని తూముకుంట వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసు క తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీ ల్దార్ వరలక్ష్మి తెలిపారు. తూముకుంట వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందిని పంపామన్నారు. ఇసుకను తరలిస్తు న్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను పోలీసులకు అప్పగించారు. ట్రాక్టర్ల యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నందికర్ తెలిపారు.

మిషన్ భగీరథ పైపులైన్ పరిశీలన

చిన్నంబావి, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్‌ను ఎస్ఈ జగన్మోహన్ బుధవారం పరిశీలించారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడంతో లేదని ఉన్నతాధికా రులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దాంతో ఎస్ఈ పరి శీలించారు. సమస్యను త్వరగా పరిశీలించాలని సంబం ధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హనుమంత్‌రావు, నరేష్ యాదవ్, నరేందర్ గౌడ్, మహేందర్ రెడ్డి, పరుశరాముడు, పాల్గొన్నారు.

స్తంభించిన పనులు

- మూడు నెలలుగా నిలిచిన రోడ్డు విస్తరణ పనులు
- దుమ్ముధూళితో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు
- నాసిరకంగా నిర్మాణాలతో కూలుతున్న డివైడర్ దిమ్మెలు
- ప్రభుత్వం మారడంతోనే ఆటంకాలంటున్న పుర ప్రజలు


కన్యాకపరమేశ్వరి దేవాలయం దగ్గర సగం సగం చేపట్టిన విస్తరణ పనులు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21: పట్టణ ప్రజల చిరకాల వాంఛ అయినటువంటి రోడ్ల విస్తరణ పనులు ఎక్కడికక్కడే స్తంభించిపోయాయి. గడిచిన మూడు మాసాలుగా విస్తరణ పనుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా, ఎన్నో అవరోధాలను అధిగమించి విస్తరణ పనులకు నాంది పలికారు. కొందరు ఏకంగా తమకు నష్టపరిహారం చెల్లించాలని, అంతవరకు ఇండ్లను ఖాళీ చేసేదే లేదని తెగేసి చెప్పిన దాఖలాలు కూడా లేకపోలేదు. ఈ తరుణంలో విస్తరణలో ఇండ్లు, వ్యాపార సముదాయాలు కోల్పోయిన బాధితులకు నయానో, బయానో ఇవ్వడం, డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించడం వంటి చర్యలు చేపట్టి పనులను ముందుకు నడిపించారు. కానీ అసలు సమస్య ఇక్కడే వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా పరిస్థితులు తలకిందులైయ్యాయని పలువురు పుర ప్రజలు బాహాటంగా చర్చించుకుంటున్నారు. గడిచిన మూడు నెలలుగా రోడ్ల విస్తరణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ప్రజలతో పాటు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఐదుదారుల్లో పనులు....

పట్టణంలో జరుగుతున్న విస్తరణ పనులు ఒక్క దిక్కున కాకుండా ఐదు దిక్కున విస్తరించేందుకు చర్యలు చేపట్టారు. వనపర్తి నుంచి హైదరాబాద్, పెబ్బేరు, పాన్‌గల్, కొత్తకోట, చిట్యాల రోడ్లను విస్తరించేందుకు పనులు మూడేళ్ల క్రితం మొదలు పెట్టారు. వనపర్తి నుంచి చిట్యాల రోడ్డు పనులు దాదాపు పూర్తి అయినప్పటికీ, వనపర్తి నుంచి హైదరాబాద్ వెళ్లే రోడ్డు పనులు మాత్రం 80శాతం పూర్తి చేశారు. మిగిలిన పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. ప్రభుత్వం మారడం, సంబంధిత కాంట్రాక్టర్లు తమకు సమయానికి బిల్లులు వస్తాయో? లేదో ? అనే భావనతో ఉండటంతో పనులు సాగడం లేదు. అసంపూర్తిగా పనులు ఉండటం వల్ల తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవలే పాలిటెక్నిక్ కళాశాల ముందు జరిగిన బైక్ ప్రమాదంలో ఒక మహిళ రెండు కాళ్లపై లారీ వెళ్లిన ఘటన, అంబేద్కర్ చౌరస్తాలో మరో వ్యక్తి బైక్‌పై నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలు అయిన సంఘటనలవంటివి అనేకం ఉన్నాయి.

నాసిరకం పనులు....

రోడ్ల విస్తరణ పనుల్లో భాగమైన డివైడర్ నిర్మాణం, మీడియన్ ప్లాంటేషన్ పనుల్లో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారనే వాదనలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. వనపర్తి నుంచి హైదరాబాద్ వెళ్లే రహదారి మధ్యలో నిర్మించిన డివైడర్ దిమ్మెలు కాలుతో తన్నితేనే కూలిపోతున్నాయి. ఏమాత్రం నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన డివైడర్ దిమ్మెలు ఇప్పటికే చాలా చోట్ల కూలిపోవడమే కాకుండా నెర్రలు విడిచాయి. వీటితో పాటు డివైడర్ మధ్యలో ఎంతో ఖరీదైన వివిధ రకాల మొక్కలను రూ. 2 కోట్ల 30 లక్షల టెండ ర్ ద్వారా ఏర్పాటు చేసేందు కు మునిసిపల్ కౌన్సిల్ తీర్మా నం చేసింది. ఈ మొక్కలపై కూ డా సరైన పర్యవేక్షణ లేకపోవ డంతో ఎండి పోవడం, పశు వులకు మేతగా మారాయి. తక్షణమే ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్ర త్యేక చొరవ తీసుకుని రోడ్ల విస్తరణ పనులను ముమ్మరం చేయించాలని పలువురు పుర ప్రజలు కోరుతున్నారు.


పశువులకు మేతగా మారిన మీడియన్ ప్లాంటేషన్ మొక్కలు


రామటాకీస్ ముందు నిర్మిస్తున్న వంతెన దగ్గర అసంపూర్తి పనులతో దుమ్ము లేస్తున్న దృశ్యం


నాసిరకంగా నిర్మించడంతో కూలిపోతున్న డివైడర్ దిమ్మెలు

చిత్తశుద్ధి ఉంటే పనులు చేయించాలి



ప్రస్తుతం ఏర్పడిన ప్రభుత్వ పాలకులకు చిత్తశుద్ధి ఉంటే పట్టణంలో విస్తరణ పనులు మొదలు పెట్టాలి. కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడం అనేది అవాస్తవం. ఎందుకంటే ఇప్పటికే సగానికిపైగా బిల్లులు అయ్యాయి. మిగిలిన బిల్లులు రాకుండా ఎక్కడికిపోవు. ఎన్నికల్లో రోడ్ల విస్తరణ బాధితులతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకోవడం వల్లనే పనులు ఆగిపోయాయి. స్థానిక ఎమ్మెల్యే పనులు మొదలు పెట్టిస్తే మునిసిపల్ పాలకవర్గం విస్తరణ పనులకు పూర్తిగా సహకరిస్తాం.

- గట్టు యాదవ్, మునిసిపల్ చైర్మన్, వనపర్తి

కాంట్రాక్టర్లకు నేను గ్యారెంటీ



ప్రభుత్వం మారిందని కాంట్రాక్టర్లు తమకు బిల్లులు రావనే భయం వీడాలి. ప్రతి కాంట్రాక్టర్‌కు తాను గ్యారెంటీ ఇస్తున్న, పనులు వేగంగా పూర్తి చేయండి. ఇక నుంచి చేసే ప్రతి పనికి రెండు నెలల్లో బిల్లులు దగ్గరుంచి చేయిస్తా. గత పాలనలో బిల్లులు పెండింగ్ ఉండటం వల్ల పనులు నిలిచిపోయాయి. కేవలం ఒక్క కాంట్రాక్టర్‌కే రూ. 24కోట్ల బిల్లు పెండింగ్‌లో పెట్టారు. అంతేకాకుండా మెడికల్ కాలేజీ కాంట్రాక్టర్‌కు కూడా రూ. 66 కోట్లు పెండింగ్ ఉంది. నియోజకవర్గంలో దాదాపు రూ. 214 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టిన ఘనులు గత పాలకులు. అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. గతం కంటే నాణ్యవంతంగా పనులు చేయిస్తాం.

- తూడి మేఘారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కొత్తకోట, ఫిబ్రవరి 21 : మండల కేంద్ర సమీపంలో ఉన్న వెంకటగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు రెండవ రోజు బుధవారం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఆలయ అర్చకులు మురళి ధ్వజారోహణ, భేరిపూజ, దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ, హోమ, బలిహరణ పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. గురువారం స్వామివారం కల్యాణోత్సవ ఉంటుందని, ఇందుకు ఏర్పాట్లను చేపట్టినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్ టెస్టుకు విద్యార్థి ఎంపిక

వీపనగండ్ల, ఫిబ్రవరి 21: రాష్ట్రస్థాయి సైన్స్ టెస్టుకు జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల విద్యార్థి గౌతం చక్రి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జాతీయస్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లాస్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచి మూడవ స్థానంలో గౌతనం నిలిచినట్లు వివరించారు. ప్రతిభ కనబరిచిన గౌతం చక్రిని ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామ పంచాయతీల తనిఖీ


శాఖాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాన్‌గల్, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని దవాజి పల్లి, మాధవరావుపల్లి, శాఖాపూర్ గ్రామ పంచాయతీలను బుధవారం ఎంపీడీవో కోటేశ్వర్ తనిఖీ చేశారు. దవాజిపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామి పనులను ఆయన పరిశీలించారు. అదేవిధంగా శాఖాపూర్ గ్రామం లో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలను పరిశీలించి వేసవిలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని వనసే వకులను ఆదేశించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెం ట్, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గోపాల్‌పేట ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో రూ. 29 లక్షలతో రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. శాంతినగర్, అంబేడ్కర్ కాలనీ, గాంధీ నగర్, ఎర్రగట్టులో పనులను చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు శివన్న , నాయకులు వెంకటయ్య, పావురాల శేఖర్, మేస్త్రీ బాలయ్య, మాల గోపాల్, తెలుగు బాలయ్య, శివుడు, బెంజిమెన్, కేతపల్లి తిరుపతి, కోదండం, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల వేతనాలు విడుదల హర్షం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి21: ధూపదీప నైవేద్య అర్చకుల పెండింగ్ వేతనాలను విడుదల చేయడం హర్షనీయమని ఆ సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షుడు పీవీ లక్ష్మీకాంతాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తమ గోడు విని వేతనాలు విడుదలకు కృషి చేసిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కమిషనర్‌కు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు.